

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కడప అర్బన్

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన ఎఆర్ హెడ్ కానిస్టేబుల్ బి.నారాయణ కుటుంబానికి ఎస్పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ రూ.2.5 లక్షల ఆర్థిసాయాన్ని జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. పోలీస్ సంక్షేమంలో భాగంగా పోలీసు వితరణ నిధి నుంచి ఈ మొత్తాన్ని ఇచ్చారు. హెడ్ కానిస్టేబుల్ సతీమణి బి.రమాదేవికి చెక్కును పంపిణీ చేశారు. కానిస్టేబుల్ కుటుంబ యోగక్షేమాలు విచారించారు. అంకిత భావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది మరణించడం బాధాకరమన్నారు. పోలీసు శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎఒ కె.వి రమణ, డిపిఒ బి సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ నాయక్, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు దూలం సురేష్ పాల్గొన్నారు.

వ్యక్తులు ముఖ్యం కాదు.. వ్యవస్థ శాశ్వతం

- పిఎసి చైర్మన్ కూన రవికుమార్

ప్రజాశక్తి-కడప

వ్యక్తులు ముఖ్యం కాదు, వ్యవస్థ మాత్రమే శాశ్వతమైనదని ప్రభుత్వ బాధ్యత ప్రతి అధికారిపై ఉందని ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ అసెంబ్లీ పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ (పిఎసి) చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ పిజిఆర్ఎస్ హాలులో రవికుమార్ అధ్యక్షతన కలెక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో యోగి వేమన విశ్వ విద్యాలయం, వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ, రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీ (ఐఐఐటి ఇడుపులపాయ), రాయలసీమ స్టీల్ కార్పొరేషన్ లిమిటెడ్, కడప స్టీల్ కార్పొరేషన్ లిమిటెడ్, పులివెందుల ఏరియా డెవలప్మెంట్ అథారిటీ (పాడా), కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా), ఎపి టూరిజం వైఎస్ఆర్ కడప రీజియన్, ఎపి సెంటర్ ఫర్ అడ్వాన్స్ రీసెర్చ్ ఆన్ లైవ్ స్టాక్ లిమిటెడ్ (ఎపి కార్ల్) సంస్థల నిర్వహణ, అభివృద్ధి, పురోగతిపై చైర్మన్ రవికుమార్ క్షుణ్ణంగా సమీక్షించారు. ముందుగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా జిల్లాలో అన్ని రంగాలకు పురోగమనంలోకి తీసుకురావడానికి జిల్లా యంత్రాంగం అన్ని విధాలా కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ ఆశయ సాధన దిశగా జిల్లాలో అభివృద్ధి అన్ని విధాలా సంతృప్తికరంగా సాగేలా చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలో అన్ని రకాల సహజ వనరులు సమృద్ధిగా ఉన్నాయని, శాస్త్ర సాంకేతిక రంగాల్లో, విద్యా వైజ్ఞానిక అంశాలు, నైపుణ్య అభివృద్ధిలో జిల్లా యువత ముందంజలో ఉందన్నారు. పిఎసి చైర్మన్ రవికుమార్ మాట్లాడుతూ జిల్లా విద్యా సాంకేతిక పారిశ్రామిక మౌలిక అభివృద్ధిలో పురోగమనం వైపు అడుగులేస్తుండడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఆకాంక్ష జిల్లాల లక్ష్య సాధనలో పురోగమనంలో జిల్లా ముందంజలో ఉన్నా ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ఇంకా సంతృప్త స్థాయిలో అన్ని అంశాల్లో జిల్లాలో అభివృద్ధి జరగాల్సిన అవసరం ఉందన్నారు. మౌలిక సదుపాయాలను సమకూర్చుకోవడంలో, అకడమిక్,



సమావేశంలో మాట్లాడుతున్న పిఎసి చైర్మన్ రవికుమార్

నూతన అధ్యయన పరిశోధనలో రాష్ట్రంలో ప్రత్యేక స్థానాన్ని, గుర్తింపు పొందుతున్న యోగివేమన యూనివర్సిటీ శాస్త్ర సాంకేతిక పరిశోధనలు, లలిత కళల అభివృద్ధికి మరించ ప్రాచుర్యం రావాలన్నారు. రెండు రోజులుగా జిల్లాలో పర్యటించిన కమిటీకి జిల్లా స్థితిగతులపై పూర్తి అవగాహన కలిగిందని, ఇప్పటివరకు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నా కూడా మరింత పురోభివృద్ధి జరగాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని శాఖల్లో విధిగా ఆడిటింగ్ జరగాలన్నారు. జిల్లా అభివృద్ధికి కావాల్సిన అన్ని వనరులు ఉన్నాయని, అధికారులు పూర్తి బాధ్యత తీసుకుంటే జిల్లాకు అన్నీ సమకూరినట్లేనన్నారు. సమావేశంలో పిఎసి సభ్యులు ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, పామర్రు ఎమ్మెల్యే కుమారరాజా, జెసి అదితి సింగ్, డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు, యోగి వేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ రాజశేఖర్, డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ విసి ఆచార్య జి.జయరామిరెడ్డి, ఆర్‌జియుకెటి ఇన్‌ఛార్జి విసి ఆచార్య విజయ్ కుమార్, ఎపి కార్ల్ సిఇఒ శ్రీనివాస ప్రసాద్, టూరిజం ఆర్‌డి రమణ కుమార్, సిపిఒ హాజమతయ్య, కడప ఆర్‌డిఒ జాన్ ఎర్విన్, కమిషనర్ మనోజ్‌రెడ్డి, సంబంధిత శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎన్.నాగార్జునరెడ్డి

వైద్య విద్య ప్రయివేటీకరణ తగదు : వైసిపి

ప్రజాశక్తి - కడప

అబద్ధాలు చెప్పడంలో చంద్రబాబు నాయుడుకు మించిన వారు ఎవరూ లేరని, వైద్య విద్యను ప్రయివేటీకరించడం తగదని వైసిపి డాక్టర్స్ వింగ్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎన్. నాగార్జునరెడ్డి అన్నారు. శుక్రవారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పిపిపి మోడల్‌ను ఇప్పటికైనా వెనక్కు తీసుకోవాలని అన్నారు. పేద, మధ్యతరగతి వారికి ఉచిత వైద్య విద్యను, ఉచిత వైద్యాన్ని అందించాలన్నారు. పూర్వకాలంలో గ్రామాల్లో చెట్టు కింద వీధి నాటకాలు, బుర్రకథలు, హరికథలు పెట్టేవారు అన్నారు. అలానే మొన్న కమలాపురంలో చంద్రబాబు నాయుడు వేప చెట్టు కింద సభ పెట్టి సెలెక్టర్ వారిని తీసుకొచ్చి ఊకదంపుడు ఉపన్యాసం చేశారన్నారు. ఒక్కటి కూడా సత్యం మాట్లాడింది లేదన్నారు. వైఎస్ఆర్ రైతు భరోసా పేరును అన్నదాత సుఖీభవగా మార్చారన్నారు. అన్నదాత సుఖీభవలో అన్ని కోతలే విధించారన్నారు. రాయలసీమను రతనాలసీమగా మారుస్తానని గొప్పలు చెప్పుకుంటున్నారని పేర్కొన్నారు. రాయలసీమను చంద్రబాబు నాయుడు ఉద్ధరించింది ఏమీ లేదన్నారు. వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు నాయుడుకు ఇప్పుడు రైతులంటే ఎందుకు అంత ప్రేమ చూపిస్తున్నారో అర్థం కావడం లేదని వాపోయారు. వైసిపి యువజన విభాగం నగర అధ్యక్షులు గుంటి నాగేంద్ర మాట్లాడుతూ రాయలసీమను రతనాల సీమగాచేశానని చంద్రబాబు నాయుడు చెప్పడం అబద్ధం కాదా అన్నారు. అనంతపురంలో ఉన్న ఎంసి కళాశాలను మంగళగిరికి తీసుకు పోలేదా అని ప్రశ్నించారు. జగన్మోహన్‌రెడ్డి తెచ్చిన కంపెనీలలో ప్రపంచంలోనే గొప్పదైన కర్నూల్‌లోని సోలార్ విండ్ హైడ్రో పవర్ ఎనర్జీ కంపెనీని తానే తీసుకొచ్చానని అబద్ధాలు చెప్పడం చంద్రబాబుకు అలవాటైందని విమర్శించారు. విలేకరుల సమావేశంలో నాగేంద్ర, ఫయాజ్, రాహుల్ రెడ్డి, సతీష్ రెడ్డి పాల్గొన్నారు.

పొరుగు వారి హక్కులను కాపాడుదాం

ప్రజాశక్తి-కడప అర్బన్ : పొరుగు వారి హక్కులను కాపాడదామని మదరస ఏ జెహారలో జమాతే ఇస్లామి హింద్ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం బెల్లంమండి వీధిలో ఉన్న ఇస్లామీ హింద్ కార్యాలయంలో పొరుగు వారి హక్కులను కాపాడుదాం అనే పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జమాతే ఇస్లామి హింద్ కేంద్ర ప్రతినిధి మండలి సభ్యులు మౌలానా ఇందాదుల్లా హుసేని నిజామి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో మనిషిలోని మానవత్వం మాయమవుతుందని తెలిపారు. పోటీ ప్రపంచంలో కృత్రిమ మేధతో కూడిన జ్ఞాన విస్ఫోటన యుగంలో మనిషి ఎంతో పురోగతిని సాధించాడని పేర్కొన్నారు. దాంతో పాటు తానూ మర మనిషిగా మారి తన పక్కనే ఉన్న పొరుగు వారిని కనీసం పలకరించేందుకైనా సమయం వెచ్చించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పొరుగు వారితో మంచి స్నేహ బంధం ఉండాలని సూచించారు. మంచి సాధికారత జీవితాన్ని ప్రశాంతంగా జీవించి మంచి మార్గంలో నడవాలని కోరారు. కార్యక్రమంలో జమాతే రాష్ట్ర కార్యదర్శి షాకీర్ హుస్సేన్, జమాతే సేవ సంఘ అధ్యక్షుడు వి.ఎస్.రహమతుల్లా, సంస్థ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిఐని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి- పోరుమామిళ్ల : తెలుగుదేశం పార్టీ పోరుమామిళ్ల మండల అధ్యక్షులు నగిరి భైరవప్రసాద్ నూతంగా విధుల్లో చేరిన సిఐ హేమంత్‌కుమార్‌రావును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలం ప్రజలందరికీ సమానం గాన్యాయం చేయాలన్నారు. గ్రామాల్లో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు చోటు చేసుకోకుండా గట్టి చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తుపాకుల ప్రసాద్, మస్తాన్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ముద్దనూరు : సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సిఐ దస్తగిరి సూచించారు. రాజులగురువాయపల్లె గ్రామంలో శుక్రవారం దస్తగిరి ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు, శక్తి యాప్, మహిళలపై జరిగే నేరాల, భద్రత చిట్కాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా కానిస్టేబుల్ వాణి, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశోధన మెలకువలు ఆవశ్యకం

ప్రజాశక్తి- కడప అర్బన్: స్కాలర్‌లకు పరిశోధన మెలకువలు అత్యంత ఆవశ్యకమని భారత ప్రభుత్వ సైన్స్, టెక్నాలజీ సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్ సమన్వయకర్త, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ సోషియాలజీ ప్రొఫెసర్ సి.రాఘవ రెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయంలోని అన్నమాచార్య సెనేట్ హాల్లో స్కాలర్ లకు 'పరిశోధనకు తాత్విక పునాది, పరిశోధన పద్ధతులు' పై ఉపన్యాసం ఇచ్చారు. పరిశోధనా ప్రశ్నని అర్థం చేసుకోవడం, పరిశోధన తత్వాన్ని ఎలా ఎంచుకోవాలనే విషయం పట్ల అవగాహన కల్పించారు. అనుభవాలు, వాస్తవాలు పరిశోధన విధానానికి, డేటా సేకరణకు అనువైందిగా, అనుగుణంగా ఉండాలన్నారు. తరగతులను రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ఆచార్య చంద్ర ఓబుల రెడ్డి సమన్వయం చేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ట్రిపుల్‌ఐటి విద్యార్థులు

ప్రజాశక్తి - వేంపల్లె : రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలకు ట్రిపుల్ ఐటి విద్యార్థులు ఎంపికైనట్లు డైరెక్టర్ కుమార స్వామి గుప్తా, రిజిస్ట్రార్ అమరేంద్ర కుమార్, ఎఒ పెనుకొండ రవికుమార్ తెలిపారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను శుక్రవారం డైరెక్టర్ కుమార స్వామిగుప్తా అభినందించారు. కడప నగరంలో యోగా అండర్ -17-19 విభాగంలో యోగాసన పోటీలు నిర్వహించగా జిల్లాలోని 350 మంది బాల-బాలికలు పోటీలకు హాజరైనట్లు చెప్పారు. యోగాసన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు ఈనెల 23 నుండి 25 వరకు బాపట్లలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఇడుపులపాయి పియుసి మొదటి సంవత్సరానికి చెందిన 10 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొనేందుకు సువర్ణ అవకాశాన్ని కైవసం చేసుకున్నారని తెలిపారు. ట్రిపుల్ ఐటి విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. మరిన్ని పతకాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో డీన్ రమేష్ కైలాష్, సిఒఇ అరుణ్ కుమార్, ఫైనాన్స్ అఫీసర్ డాక్టర్ రమేష్, డిఎస్ డబ్ల్యూ డాక్టర్ వెంకటేష్, యోగా అధ్యాపకులు లక్ష్మి భారతి, అశోక్, శ్రీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

26న ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ఆందోళన

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎడిఎ ప్రభుత్వం తీసుకున్న అనేక ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలపై ఈనెల 26 దేశ వ్యాప్త పిలుపులో భాగంగా కడప సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం తలపెట్టినట్లు ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగ సుబ్బారెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసులురెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శులు (సిపిఐ,సిపిఎం) సుబ్రహ్మణ్యం, అన్వేష్, ఎఐటియుసి జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కె.సి. బాదుల్లా, నగర కార్యదర్శి ఉద్దే మదిలేటి తెలిపారు. శుక్రవారం హోచిమిన్ భవన్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీలకు కేంద్ర ప్రభుత్వం ఊడిగం చేస్తూ ప్రభుత్వ రంగాలను నాశనం చేస్తోందని మండిపడ్డారు. దేశంలో ప్రభుత్వ రంగంలో నవరత్నాలుగా పేరొందిన రైల్వేలు, ఎల్ఐసి, విమానయానం, బిఎస్ఎన్ఎల్, తదితర సంస్థలను కార్పొరేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయడమే దేశభక్తి అవుతుందా? అని ప్రశ్నించారు. పోరాడి సాధించుకున్న అనేక కార్మిక చట్టాలను, కేంద్రం నాలుగు లేబర్ కోడ్ బిల్లులుగా మార్చి 40 కోట్ల కార్మిక కుటుంబాలను రోడ్డపాలు చేస్తోందని పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈ నెల 26న దేశ వ్యాప్తంగా జరిగే నిరసన కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం ఆంక్షలు పెట్టాలని చూస్తే ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు.

దోమల నియంత్రణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - తొండూరు

దోమల నియంత్రణ అందరి బాధ్యత అని జిల్లా మలేరియా అధికారి మనోరమ పేర్కొన్నారు. మండలంలోని సంతకొవ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆగుడూరులోనిర్వహిస్తున్న ఫ్రైడే డ్రైడే, ఉచిత వైద్య శిబిరం కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్య సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన కార్మికులు బ్రిడ్జి నిర్మాణం పని నిమిత్తం ఆగుడూరుకు వచ్చారని పేర్కొన్నారు. వారు దోమకాటుకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలియజేశారు. ఆరోగ్య కార్యకర్తలు ప్రతి గ్రామాన్ని సందర్శించి జ్వరం ఉన్న వారికి రక్త పూతలు సేకరించి, వారానికి రెండు సార్లు ల్యాబ్‌కు పంపాలని చెప్పారు. ఎవరికైనా మలేరియా నిర్ధారణ అయితే వెంటనే చికిత్స అందించాలన్నారు. తప్పని సరిగా ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తల దగ్గర టార్చ్ లైట్‌తో లార్వాను గుర్తించాలని అని, ప్రతి ఒక్కరూ దోమతెరాలు వాడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య, ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్రమణ్యం, సూపర్ వైజర్ రాధా, సిహెచ్ఒ నందీశ్వర్ రెడ్డి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

- యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి విద్యాశాఖ మంత్రి లోకేష్ చొరవ చూపాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా కోరారు. శుక్రవారం సాయంత్రం పులివెందులలో నిర్వహించిన ప్రాంతీయ మండలాల ముఖ్య నాయకుల సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై విద్యాశాఖ మంత్రి జోక్యం చేసుకొని ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు : ఆర్థిక బకాయిలన్నింటిని వెంటనే చెల్లించాలని, గత ప్రభుత్వం ప్రకటించిన పిఆర్‌సి కమిటీని పునరుద్ధరించి నూతన కమిటీని నియమించాలని డిమాండ్ చేశారు. అరియర్స్ 29 శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సర్వీస్‌లో ఉన్న టీచర్లు అందరూ తప్పనిసరిగా టెట్ పాస్ అవ్వాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రివ్యూ పిటేషన్ వేయాలని కోరారు. 2010 వ సంవత్సరానికి ముందు ఉపాధ్యాయ అర్హత పరీక్ష లేకుండా ప్రభుత్వాలే నియామకాలు చేపట్టాయని, అలాంటప్పుడు టెట్ పాస్ అవ్వాలనే నిబంధన నుంచి మినహాయించే విధంగా రాష్ట్ర ప్రభుత్వమే సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం అమలు చేసినా రాష్ట్ర ప్రభుత్వం వారికి పాత పింఛను విధానాన్ని వర్తింపజేయకపోవడం శోచనీయం అని




మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా

పేర్కొన్నారు. ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని కోరారు. మెగా డిఎస్‌సి ద్వారా ఎంపికై నూతనంగా ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయులకు నేటికీ జీతాలు అందకపోవడం శోచనీయం అని అన్నారు. ప్రభుత్వం వెంటనే జీతాలు చెల్లించడానికి తగు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి చెరుకూరి శ్రీనివాసులు, వేముల మండల కన్వీనర్ రాజశేఖర్, తొండూరు మండల కన్వీనర్ రమేష్ బాబు పాల్గొన్నారు.

హెవిహాతో ఏపికార్ల్ ఒప్పందం

ప్రజాశక్తి - కడప

జిల్లాలో విదేశీ పెట్టుబడి దారులను ఆకర్షించేందుకు మ్యాక్స్ వెల్ బయోసైన్సెస్ అమెరికా వారి అనుబంధ సంస్థ హెవిహా, ఎపికార్ల్‌తో ఒప్పందం చేసుకున్నట్లు కలెక్టరు శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు.



ఒప్పంద పత్రాలు చూపుతున్న కలెక్టర్, ప్రతినిధులు

శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో మ్యాక్స్ వెల్ బయోసైన్సెస్ అమెరికా వారి అనుబంధ సంస్థ హెవిహా ప్రతినిధి డాక్టర్ చేతన్ టమహంకర్‌తో పులివెందుల నియోజక వర్గంలోని ఎపి కార్ల్ తరపున చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రొఫెసర్ శ్రీనివాస ప్రసాద్, కలెక్టర్ ఆధ్వర్యంలో ఎంఒయు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమికంగా రానున్న ఆరు నెలల్లో రూ.30 కోట్ల పెట్టుబడితో రిసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ ల్యాబ్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. తద్వారా దాదాపు 50 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయన్నారు. దశల వారీగా మరో 4 ఏళ్లల్లో రూ. 2 వేల కోట్ల పెట్టుబడితో మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ నిర్మాణానికి ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. ఇప్పటికే ఈ మ్యాక్స్ వెల్ బయోసైన్సెస్ సంస్థ అమెరికా రక్షణ సంస్థ తోటి ఏడు ఒప్పందాలు కుదుర్చుకుందని, ఇటువంటి సంస్థ మన దేశంలో మొదటిసారిగా ఇక్కడ పెట్టుబడి పెడుతోందన్నారు. సంస్థ ప్రతినిధులతో మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా కావల్సినటువంటి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. పులివెందుల-బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి దగ్గరగా ఉండడంతో పాటు జాతీయ రహదారులు అభివృద్ధి చెంది ఉండడంతో తక్కువ ప్రయాణ సమయం తీసుకోవడం వల్ల విదేశీ పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు ఎక్కువ అవకాశాలున్నాయని చెప్పారు. ఎపి రెరా మాజీ చైర్మన్ రామనాథ్ వెలమాటి, మినిస్ట్రీ ఎంఎస్ఎంఇ టెక్నికల్ అడ్వైజర్ శంకర్ ప్రసాద్, అగ్రికల్చర్ అండ్ పశు సంవర్ధక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్, కలెక్టరు చెరుకూరి శ్రీధర్ సంయుక్త కృషి వల్ల ఒప్పంద పత్రం కార్యరూపం దాల్చిందని ఏపి కార్ల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రొఫెసర్ శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఏపి కార్ల్ శాస్త్రవేత్త డా.శివ ప్రసాద్, అడ్మిన్ లక్ష్మి ప్రసాద్ పాల్గొన్నారు.

టిడిపి నగర అధ్యక్షుడికి ఘన సన్మానం

ప్రజాశక్తి - కడప అర్బన్

టిడిపి నగర్ అధ్యక్షునిగా ఎన్నికైన పఠాన్ మన్సూర్ అలీ ఖాన్‌ను ఆ పార్టీ 26వ డివిజన్ ఇన్‌ఛార్జి చలవలముడి శంకర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శుక్రవారం డివిజన్ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకుడు, విద్యావంతుడు, ఉత్సాహవంతుడు, మంచి సేవగుణం కల్గిన వ్యక్తి తెలుగుదేశం పార్టీలో చేరి అతి తక్కువ కాలంలోనే పార్టీ లో అందరి మనన్నలు పొందాలని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కింది స్థాయి నుంచి పనిచేసి కడప నగరంలో పార్టీ గెలుపుకై తన వంతుగా ఎంతో కృషి చేశారన్నారు. వారి తండ్రి నుంచి వారి కుటుంబం సభ్యులు మంచి ప్రజా సేవా కార్యక్రమలతో ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండేవారన్నారు. కార్యక్రమంలో ఎన్నారై కువైట్ ఉపాధ్యక్షులు షేక్.రహమతుల్లా, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ, 28వ డివిజన్ టిడిపి ఇన్‌ఛార్జి గాజులపల్లె రాఘవేంద్ర, ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కొమ్మలపాటి సుబ్బరాయుడు, ఎస్సీ సెల్ నగర ఉపాధ్యక్షుడు వంకెల ఆనంద్ రావు, టిఎన్ఎస్ఎఫ్ నగర అధ్యక్షుడు అనిల్, టిడిపి బిసి నాయకులు చంద్రశేఖర్, తెలుగు మహిళా నగర అధ్యక్షురాలు పార్వతి, జిల్లా ఉపాధ్యక్షురాలు చవలముడి మౌనిక, యువనాయకులు చవలముడి ప్రతాప్, దియ్యాల చిన్న, ఆనంద్, గోశాలకార్తీక్, బక్క చిన్న, గౌస్, శ్రీకాంత్, పూర్ణ పాల్గొన్నారు.



మన్సూర్ అలీఖాన్‌ను సన్మానిస్తున్న నాయకులు



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఒంటిమిట్టలో యాత్రికుల బస కోసం రూ.37 కోట్లతో

వంద రూముల భవన నిర్మాణానికి శ్రీకారం

ప్రజాశక్తి - ఒంటిమిట్ట

బ్రహోత్సవాల సమయంలో యాత్రికులు ఒంటిమిట్టలో బస చేసేందుకు రూ. 37 కోట్లతో వంద రూముల భవన నిర్మాణానికి టిటిడి అధికారులు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం 11 గంటలకు టిటిడి అధికారులు కల్యాణ మండపం ఎదురుగా ఉన్న సర్వేనెంబర్ 15/19లో ఉన్నస్థలాన్ని పరిశీలించారు. ప్లానింగ్ అప్రూవలకు కొలతలు తీశారు. ఇందులో భాగంగానే జెసిబితో మట్టి తీసి సాయిల్ టెస్టింగ్‌కు పంపించారు. ఈ సందర్భంగా టిటిడి నాగరాజు మాట్లాడుతూ ప్లానింగ్ అప్రూవల్ అయ్యాక టెండర్లు పిలిపించి భవన పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. యాత్రికుల కోసం శాశ్వత బస నిర్మాణానికి మన్నికతో కూడిన భవనాన్ని ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఇందులో మూడు ఫ్లోర్లు వంద రూములు ఉంటాయని, అదనంగా కిచెన్ రూము కూడా ఉంటుందని పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో కల్యాణం కోసం దూర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులు బస చేసేందుకు వీలుగా రూములను నిర్మించనున్నామని చెప్పారు.

అన్నదాత సుఖీభవ వారోత్సవాలకు కసరత్తు!

ఐదు రోజులపాటు నిర్వహణకు ఆదేశాలు

700 ఆర్ఎస్‌కెల వారీగా రైతుల సర్వే

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో అన్నదాత సుఖీభవ వారోత్సవాల నిర్వహణపై కసరత్తు చేస్తున్నారు. గురువారం రాష్ట్ర వ్యవసాయ అనుబంధ శాఖల ఉన్నతాధికారులు అగ్రికల్చర్, హార్టీకల్చర్, సెరీకల్చర్, ఫిషరీస్ డిపార్టుమెంట్లు కలిసికట్టుగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశాయి. అధికార యంత్రాంగం సెల్ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశాయి .కడప, అన్నమయ్య జిల్లా వ్యవసాయ అనుబంధ శాఖల యం త్రాంగాలు కడప జిల్లాలోని 432 రైతు సేవా కేంద్రాలు, అన్నమయ్య జిల్లాలోని 268 రైతుసేవా కేంద్రాల్లో నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. కడప జిల్లా పెండ్లిమర్రి మండలం చిన్నదాసరిపల్లిలో నిర్వహించిన అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవసాయం లాభదాయకంగా మారడానికి ఉద్దేశించి ప్రవచించిన పంచ సూత్రాలపై రైతులకు అవగాహన, సాగుదారులపై సర్వే నిర్వహించనున్నట్లు సమాచారం.

విమర్శలు చేసుకోవడం సరైంది కాదు : సిపిఎం

ప్రజాశక్తి- పులివెందుల టౌన్ : పులివెందుల నియోజకవర్గం పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయకుండా ఒకరినొకరు ఇరు పార్టీలు విమర్శించుకోవడానికే కాలం సరిపోతోందని సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యులు మనోహర్ పులివెందుల సిపిఎం నాయకుడు గఫూర్ అన్నారు శుక్రవారం పట్టణంలోని గఫూర్ డ్రైవింగ్ స్కూల్‌లో మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ వైసిఇప అధికారంలో ఉన్నప్పుడు పులివెందుల నియోజకవర్గం అభివృద్ధి చేశారని, అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయలేదని పేర్కొన్నారు. పైగా ఒకరినొకరు విమర్శలు చేసుకుంటున్నారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న మెడికల్ కళాశాలను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి కూటమి నాయకుల కృషి చేయాలన్నారు. మున్సిపాలిటీలో పెండింగ్‌లో ఉన్న సిసి రోడ్లు, డ్రెయినేజీ, జగనన్న గృహాలను పూర్తి చేసి ప్రజలకు అందించాలని సూచించారు.

జాతీయ జంబూరికి కెజిబివి విద్యార్థులు

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లక్నోలో ఈ నెల 23 నుంచి 29 వరకు నిర్వహించబోయే 19వ నేషనల్ జంబోరి, గ్రాడ్ ఫినలీ డైమండ్ జుబిలీ జంభూరికి కడప జిల్లా పెండ్లిమర్రి మండలం కెజిబివి విద్యార్థులు ఎంపికయ్యారని గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ దార్ల రూత్ ఆరోగ్య మేరి అన్నారు. శుక్రవారం విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల నుంచి స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో ఉన్న విద్యార్థులు, స్కౌట్స్ మాస్టర్స్, గైడ్స్ కెప్టెన్ లు వేల సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు. జిల్లా నుంచి సుమారు 70 మంది పాల్గొనబోతున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ ఓ సరస్వతి, పి.డి.సంతోషి కుమారి పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కడప : ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ ఖైదీలకు సూచించారు. శుక్రవారం జడ్జి బాబా ఫక్రుద్దీన్ కడప పురుషుల, మహిళల కేంద్ర కారాగారాలను సందర్శించారు. ఈ సందర్భంగా జైలు పరిసరాలను, వసతి గదులను, వంటగదిని, టాయిలెట్స్ లను, రిజిస్టర్లను పరిశీలించారు. ఖైదీలకు అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలపై ఆరా తీశారు. . ఉచిత న్యాయ సహాయమును సద్వినియోగం చేసుకోవాలి అన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంటులు, ఖైదీలు పాల్గొన్నారు.

పశువుల పాకలను శుభ్రంగా ఉంచుకోవాలి : జెడి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు) : రైతులు పశువుల పాకలను శుభ్రంగా ఉంచుకోవాలని పశుసంవర్ధక శాఖ జెడి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం మైదుకూరు మండల పరిధిలోని సరస్వతిపేట, అన్నలూరు, జి.వి. సత్రం, వనిపెంట గ్రామాల్లోని పశువైద్యశాలలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం పశువుల పాకలను పరిశీలించి రైతులకు పలు సూచనలు ఇచ్చారు. వర్షాకాలం పశువుల పాకలను ఆరబెట్టుకుని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ పాడి రైతులకు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకులు అరెస్టు

- రూ.10.50 లక్షల నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం

- ప్రొద్దుటూరు డిఎస్‌పి భావన వెల్లడి

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు

పట్టణంలో క్రికెట్ బెట్టింగ్ ముఠా కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని డిఎస్‌పి భావన తెలిపారు. శుక్రవారం ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డిఎస్‌పి మాట్లాడారు. బెంగళూరు కేంద్రంగా చేసుకొని ఆన్‌లైన్ ట్రేడింగ్‌కు తెలిసిన వారిని నమ్మించి వారి ద్వారా పలు బ్యాంకులలో కరెంట్ ఖాతాలు తెరిపించి వారి బ్యాంకు పాస్ పుస్తకాలు తీసుకుని తద్వారా బెట్టింగ్ నిర్వహిస్తుంటారని చెప్పారు. ఈనెల 5న అరెస్టయిన ముఠాలోని ఆరుగురు సభ్యులు ఇచ్చిన నేర ఒప్పందం మేరకు మరో ఇద్దరిని అరెస్టు చేశామన్నారు. ఈ ముఠాలోనే కీలక సభ్యులైన ప్రొద్దుటూరు మండలం లింగాపురం గ్రామానికి చెందిన వీర శంకరయ్య, కాశినాయన మండలానికి చెంది ప్రస్తుతం బెంగళూరులో ఉన్న ఆర్ల చంద్రయాదవ్‌పై నిఘా ఉంచామన్నారు. ఈ నిఘాలో భాగంగా శుక్రవారం ముఠాలో కీలక సభ్యులైన ధనియాల వీరశంకరయ్యను, ఆర్ల చంద్ర యాదవును అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. వారి వద్ద నుండి రూ. 10, 56,000 నగదు, మూడు సెల్ ఫోన్లు,ఒక బ్యాగ్ స్వాధీనం చేసుకు న్నామన్నారు. వీర శంకరయ్య బెంగుళూరులో పీజీ నడుపుతున్నాడన్నారు. ఆర్ల చంద్రయాదవ్ రాయల్ బుక్ 365 .ఇన్.కామ్ అనే వెబ్‌సైట్ ద్వారా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారన్నారు. సదరు



నిందితులను మీడియా ఎదుట హాజరు పరిచి వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి భావన

బెట్టింగ్ లావాదేవీల కోసం బ్యాంకు ఖాతాలు అవసరం కాగా తాము నిర్వహిస్తున్న అక్రమ బెట్టింగ్ వ్యవహారాన్ని ఈ కేసులో గతంలో అరెస్టు అయిన అనుచరుల ద్వారా బ్యాంకు ఖాతాలు తెరిపించుకొని వారికి కమిషన్లు ఇస్తూ విస్తృతంగా ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారన్నారు. ప్రస్తుతానికి బ్యాంకుల ద్వారా తెలిసిన సమాచారం మేరకు ఈ బెట్టింగుకు సంబంధించిన అనుమానాస్పద లావాదేవీలు చేసిన అన్ని ఖాతాలను నిలిపివేయమని ఆయా బ్యాంకులను కోరామన్నారు. ఈ ముఠా కార్యకలాపాలను గుర్తించి వారిని పట్టుకుని చట్టం ముందు నిలబెట్టడంలో ప్రతిభ చూపిన టూటౌన్ సిఐ సదాశివయ్యతోపాటు వారి సిబ్బందిని అభిన ందనలు తెలిపారు. రివార్డులకు సిఫారసు చేస్తామని డిఎస్‌పి భావన తెలిపారు.



ఖాజీపేట : పుట్టా సుధాకర్‌యాదవ్ పుట్టిన రోజు వేడుకల్లో టిడిపి నాయకులు

ఘనంగా ఎమ్మెల్యే 'పుట్టా' జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు శాసన సభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ జన్మదినం సందర్భంగా శుక్రవారం పల్లవోలు వృద్ధాశ్రమంలో టిడిపి నాయకుడు బుర్రి నాగరాజు అధ్వర్యంలో వృధులకు పండ్లు, కేకు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మేకల సుదర్శన్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ నయాబ్ రసూల్, పిట్టి లక్ష్మీనారాయణ, మేకల సుధాకర్, ఎ. రమణారెడ్డి, ఎన్. ప్రసాద్, హరి పాల్గొన్నారు. **మైదుకూరులో...** స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ జన్మదిన వేడకలు అట్టహాసంగా నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ కేకును కోసి పంచిపెట్టారు. కార్యక్రమంలో కనీస వేతనాల కమిటీ రాష్ట్ర డైరెక్టర్ దాసరి బాబు, నీటిపారుదల సంస్థ డైరెక్టర్ అన్నవరం సుధాకర్ రెడ్డి,రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనపాల జగన్, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఏపీ రవీంద్ర, టిడిపి నాయకులు మిల్లు శీను, ఆకుల కృష్ణయ్య, బిఎన్ శీను, పాశం మారుతి, కోన సుబ్బారావు, రమణ, కెపి ఎరుకలయ్య, సుబ్బరాయుడు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **ఖాజీపేట :** పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనాధ వృద్ధాశ్రమాలలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. టిడిపి సీనియర్ నాయకులు సందుల నాగ శివారెడ్డి, కెసి కెనాల్ డిస్ట్రిబ్యూటర్ కమిటీ మాజీ చైర్మన్ ఇట్టెం శ్రీరాముల యాదవ్, భూమయ్యపల్లె సర్పంచ్ కొంగాని వెంకటసుబ్బయ్య యాదవ్, కృష్ణ యాదవ్, విద్యుత్ కాంట్రాక్టర్ ఏసు పాదం, పుల్లారెడ్డి,పత్తూరు ఉపసర్పంచ్ ముత్తూరు రమణ, వార్డు సభ్యులు నారాయణ, కట్టుబడి రమణ, ఓబులు, తదితర నాయకులు పుట్టా సుధాకర్ యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే మైదుకూరు రోడ్డులోని సాయిబాబా ఆలయం వద్ద రాష్ట్ర గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ లక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో కేట్ కట్ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు గంగవరం ఆదినారాయణ రెడ్డి, ఇరగం రెడ్డి ప్రతాప్ రెడ్డి, సుబ్బయ్య, సర్పంచ్ కొంగాని వెంకటసుబ్బయ్య యాదవ్, ఆర్ఎంపి వైద్యులు ఆసిఫ్, చంద్ర భాస్కర్ రెడ్డి, పుల్లయ్య నాయుడు, జానకిరామ్ నాయుడు, కె.కె. బ్రదర్, హర్షద్ పాల్గొన్నారు. **దువ్వూరు :** స్థానిక బస్టాండ్‌లో మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ జన్మదిన సందర్భంగా మండల కన్వీనర్ బోరెడ్డి రమణారెడ్డి, దువ్వూరు టౌన్ ఇన్‌ఛార్జి పాపినేని రాంబాబు ఆధ్వర్యంలో భారీ ఎత్తున కేక్ కట్ చేసి అక్కడికి వచ్చిన అభిమానులకు కార్యకర్తలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు. **బ్రహ్మంగారిమఠం :** మైదుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ 61వ జన్మదినం సందర్భంగా బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని ఐదు రోడ్ల కూడలిలో శుక్రవారం మండల టిడిపి అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి సలహాలతో తెలుగుదేశం పార్టీ మండల నాయకుడు కానాల మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. కార్యకర్తలకు, అభిమానులకు అందజేశారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు ఎస్.ఆర్ శ్రీనివాస్‌రెడ్డి, పూజ శివ యాదవ్, గంగరాజు, మేకల సుధాకర్, బోలా శ్రీను, చెవుల వెంకటేశ్వర్లు మరియు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కలు తొలగింపు

ప్రజాశక్తి-కలసపాడు : మండలం పరిధిలోని ఆర్‌టిసి బస్టాండు పరిధిలో ఉన్న పిచ్చి మొక్కలు, చెత్తను ఆర్‌టిసి అధికారులు జెసిబితో తొలగించారు. గతంలో ప్రజలు పిజిఆర్ఎస్‌లో బస్టాండ్ ఆరవణలోపెరిగిన మొక్కలు, చెత్తాచెదారం తొలగించాలని ఫిర్యాదు చేశారు. ఇందుకు స్పందించిన అధికారులు చెత్తను తొలగించడంతోపాటు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు.

క్రమబద్ధీకరణకు చివరి అవకాశం

ప్రజాశక్తి - జమ్మలమడుగు : అనధికార నిర్మాణాల క్రమబద్ధీకరణకు చివరి అవకాశం ప్రభుత్వం కల్పించిందని, సద్వినియోగం చేసుకోవాలని మునిసిపల్ కమిషనర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1985 జనవరి 2 నుండి 2025 ఆగస్టు 31 వరకు పురపాలక పరిధిలో అనధికార నిర్మాణాలు, అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన కట్టడాలను క్రమబద్ధీకరణ చేసుకోనే అవకాశం కల్పించిందని చెప్పారు. ఈ నెల 12 నుంచి 120 రోజులలోగా ఆన్‌లైన్‌లో లైసెన్సులు టెక్నికల్ పర్సన్స్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుతో పాటు, రిజిస్టర్ దస్తావేజులు, సబ్ రిజిస్ట్రార్ జారీ చేసిన ఇ.సి, మార్కెట్ వాల్యూ కాపీ, బిల్డింగ్ ప్లాస్, బిల్డింగ్ ఫొటో ఇతర సంబందిత పత్రాలతో పాటు ప్రాథమిక ఫీజు రూ. పదివేల రూపాయలు చెల్లించాలన్నారు. బి పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, వారి భవనా లను క్రమబద్ధీకరణ చేసుకోవాలని,పట్టణాభివృద్ధికి తోడ్పడగలరని పేర్కొన్నారు.

మెరుగైన ఆరోగ్యానికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - చాపాడు : మైదుకూరు మండలం అన్నలూరు గ్రామంలో జాతీయ సేవా పథకం కింద 5వ రోజు వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ కార్యకర్తలు ఉచిత వైద్య ఆరోగ్య శిబిరంను నిర్వహించారు. గ్రామస్తులకు రక్త పరీక్ష, చక్కర వ్యాధి, బిపి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ప్రాథమిక వైద్యశాల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి.సుధా, డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం. కె. జ్యోత్స్న, అసోసియేట్ డీన్ రిప్రెసెంటేటివ్ డాక్టర్ ఎన్. వాణి, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి నమూనా పరీక్షలు తప్పనిసరి

ప్రజాశక్తి-లింగాల

పంటలు బాగా పండి రైతులు లాభాలు పొందాలంటే మట్టి నమూనా పరీక్షలను తప్పనిసరిగా చేసుకోవాలని జిల్లా రైతు శిక్షణ కేంద్రం రిసోర్స్ సెంటర్ వ్యవసాయ శాఖ ఎడి అశోక్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఇప్పట్ల, లింగాల రైతు సేవా కేంద్రంలో భూసార పరీక్షల ఫలితాలపై ఆయన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మట్టి పరీక్షల ఆధారంగా ఎరువులు వాడకం, పంటల సాగు చేయాలని రైతులకు సూచించారు. ప్రస్తుతం రబీలో సీజన్‌కు సంబంధించి 50 శాతం సబ్సిడీపై వివిధ రకాల క్రిమిసంహారక మందులు వేప నూనెను అందుబాటులో ఉంచామన్నారు రైతులకు ఆయన క్రిమిసంహారక మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రమేష్, రైతు సేవా సిబ్బంది రాణీ, ప్రసన్న, పవన్ , తేజ్ పాల్గొన్నారు.

'ఆది'ని విమర్శించే అర్హత లేదు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్



సమావేశంలో మాట్లాడుతున్న బీటెక్ రవి

వైసిపి నాయకులకు జమ్మల మడుగు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆదినారాయణరెడ్డిని విమర్శించే అర్హత లేదని పులివెందుల నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బిటెక్ రవి పేర్కొన్నారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. వారికి చేతనైతే పులివెందుల మున్సిపల్ ఎన్నికల్లో గెలిచేందుకు ప్రయత్నం చేయాలని హితవు పలికారు. సతీష్ రెడ్డి ఐదు సార్లు పోటీ చేస్తే, అన్ని సార్లూ ఓడిపోయారని, ఆదినారాయణరెడ్డి నాలుగు సార్లూ గెలిచారని పేర్కొన్నారు. జరగబోయే ఎన్నికల్లో పులివెందులలో టిడిపి జెండా ఎగరవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హజ్ కమిటీ డైరెక్టర్ మహబూబాషా, తూగుట్లమధుసూదన్ రెడ్డి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సిఐని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి- పోరుమామిళ్ల

తెలుగుదేశం పార్టీ పోరుమామిళ్ల మండల అధ్యక్షులు నగిరి భైరవప్రసాద్ నూతనంగా విధుల్లో చేరిన సిఐ హేమంత్‌కుమార్‌రావును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలం ప్రజలందరికీ సమానంగాన్యాయం చేయాలన్నారు. గ్రామాల్లో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు చోటు చేసుకోకుండా గట్టి చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తుపాకుల ప్రసాద్, మస్తాన్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి : జడ్‌పి సిఇఒ



ముద్దనూరు : మాట్లాడుతున్న జడ్‌పి సిఇఒ ఓబులమ్మ

ప్రజాశక్తి - ముద్దనూరు

పరిసరాల పరిశుభ్రత పాటించి ముద్దనూరు మండలాన్ని స్వచ్ఛంగా తీర్చిద్దేందుకు కృషి చేయాలని జడ్‌పి సిఇఒ ఓబులమ్మ సూచించారు. ముద్దనూరు మేజర్ గ్రామ పంచాయతీలో శుక్రవారం ఓబులమ్మ ఆధ్వర్యంలో సామూహిక పారిశుధ్య డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మండల ప్రజా పరిష్యత్ కార్యాలయం సభా భవనంలో ఎంపిడిఒ రాధాకృష్ణవేణి అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఇఒ మాట్లాడుతూ ముద్దనూరు పంచాయతీని ఆదర్శంగా ఎంపిక చేసి స్వచ్ఛ గ్రామంగా చేసేందుకు ప్రత్యేక సామూహిక పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టినట్లు చెప్పారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు సంబంధించిన పారిశుధ్య కార్మికులు ముద్దనూరులోని 14వార్డుల్లో ఉన్న ఇంటింటికి తిరిగి తడి,పొడి చెత్త సేకరించినట్లు తెలిపారు. 19 గ్రామ పంచాయతీల్లోని ప్రతి గ్రామాన్ని శుభ్రంగా ఉంచాలన్నారు. క్లాప్ మిత్రలకు బూట్లు ,గ్లౌజులు ఇప్పించాలని కార్యదర్శులను ఆదేశించారు.పారిశుధ్య నిర్వహణ చేసేప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి క్లాప్ మిత్రులకు అవగాహన కల్పించారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో వర్మీ కంపోస్టు తయార్ చేసే విధానంపై జమ్మలమడుగు డిఎల్‌పిఒ నూర్జహాన్, సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ వీరభద్రుడు, ఇఒ లక్ష్మీ నరసింహులు, పంచాయతీ కార్యదర్శులు, ఐసిడిఎస్ సూపర్ వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, విఒలు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు. **చక్రాయపేట :** ఇంటితోపాటు పరిసరాల ప్రాంతాలు శుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యంగా ఉండవచ్చునని ఎంపిడిఒ కె. శివారెడ్డి అన్నారు . శుక్రవారం మండల కేంద్రంలో రాయచోటి- వేంపల్లి మెయిన్ రోడ్డుతో పాటు ఉప్పలవాండ్లపల్లె, రాజీవ్ నగర్‌లో క్లీన్‌అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రీన్ పాల్గొన్న అంబాసిడర్లకు మండలంలోని సచివాలయ సిబ్బందికి అందరికి ధన్యవాదాలు తెలిపారు. **చాపాడు** పరిశుభ్రత, పచ్చదనం కలిగిన గ్రామ పంచాయతీ అనే అంశంపై గ్రీన్ అంబాసిడర్లకు, గ్రీన్ గార్డ్‌లకు శుక్రవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపిడిఒ హరినాథ్ మాట్లాడుతూ పరిసరాల శుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ పూర్తిగా గ్రీన్ అంబాసిడర్‌లపై ఆధారపడి ఉంటుందన్నారు. పొడి తడి చెత్త లను రోజూ సేకరించి డంపింగ్ యార్డ్ కు చేర్చాలన్నారు. కార్యక్రమంలో ఏఓ రామానుజం, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు. **మైదుకూరులో..** పరిశుభ్రత,పచ్చదనం కలిగిన గ్రామపంచాయతీ అనే అంశం పైన మైదుకూరు మండలంలోని అందరూ గ్రీన్ అంబాసిడర్లకు ,గ్రీన్ గార్డ్ లకు గంజికుంటలో శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ శ్రీధర్ నాయుడు మాట్లాడుతూ నందికుంట గ్రామపంచాయతీలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించామన్నారు.ప్రజలు కూడా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో గంజికుంట సర్పంచ్ జయ భారత్ రెడ్డి, డిప్యూటీ ఎంపిడిఓ ఫ్లారెన్స్ పిబి , పరిపాలన అధికారి నాగేంద్ర బాబు, పంచాయతీ అభివృద్ధి అధికారులు, పొదుపు సిఆర్‌పిలు పాల్గొన్నారు. **వేంపల్లె :** స్థానిక ఆయా ప్రాంతాల్లో ఉన్న చెత్త దిబ్బలను జెసిబి సహాయంతో తొలగించారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శ్రీకాళహస్తి ఇటిసి సీనియర్ ఫ్యాకల్టీ సరళాదేవి వేంపల్లె పట్టణంలోని ఆయా ప్రాంతాల్లో పేరుకు పోయిన చెత్త దిబ్బలను ఎంపిడిఒ కుళాయమ్మ, డిఆర్‌సి ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ రమణారెడ్డి, డిప్యూటీ ఎంపిడిఒ రామమోహన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాగభూషణం రెడ్డిలతో కలిసి పరిశీలించారు. అనంతరం పారిశుధ్య సిబ్బందికి పనిముట్లు, జర్కిన్ టోపీలు, బ్లౌజులు, మాస్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు. **పోరుమామిళ్ల :** మండలంలోని ప్రతి గ్రామంలోనూ డ్రైడే తప్పక పాటించి పరిసరాలు రిశుభ్రంగా ఉంచుకోవాలని, అందుకు అధికారులు పూర్తి స్థాయిలో ప్రజలు సహకరిస్తారని ఎంపిడిఒ ఉపేంద్ర రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపిడిఒ సభా భవనంలో స్వచ్ఛంద కార్మికులకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరుమామిళ్లలో పరిధిలోని అన్ని వీధులు శుభ్రంగా ఉంచాలని చెప్పారు. ఎక్కడా మురికి ఉండకుండా చూడాలన్నారు. గ్రామాల్లో ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా ప్రజలను చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో పోరుమామిళ్ల ఇఒ ఓబులేసు, సిబ్బంది పాల్గొన్నారు **కలసపాడు :** మహానంది పల్లె గ్రామపంచాయతీలో 23 మంది హరిత రాయబారుల చేత రోడ్లను, వీధులను శుభ్రం చేయించారు. మొక్కలను తొలగించి వేప, మామిడి , నేరేడు, ఇతర మొక్కలను నాటారు. ఈ సందర్భంగా డిఎల్‌డిఒ వెంకటశేషయ్య, ఎంపిడిఒ మహబూబ్‌బీ ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ వి. మురళీమోహన్, పరిపాలన అధికారి సీతారామ రెడ్డి, మండల ప్రజా పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



చక్రాయపేట : రోడ్డుపై ఉన్న చెత్తను తొలగింపజేస్తున్న ఎంపిడిఒ



కలసపాడు : స్వచ్ఛ రథం ప్రారంభోత్సవలో ఎంపిడిఒ మహబూబ్‌బీ

సమస్యల పరిష్కారంలో ముందుండాలి : ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ప్రజా సమస్యల పరిష్కారం లోనూ, అభివృద్ధిలోనూ దేశంలోనే అత్యున్నత స్థానంలో నిలిపేలా పనిచేయాలని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణంలో ప్రజాదర్బార్ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సి.ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ జమ్మలమడుగు అన్ని రంగాలలో ముందు ఉందన్నారు. సిమెంటు, ఉక్కు, సోలార్, థర్మల్ పవర్ ప్రాజెక్టులతో పాటు జలాశయాలు పర్యాటకంగా గండికోట అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం ఆర్‌డిఒ సాయి శ్రీ, భూపేష్ సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ ఏవైనా సమస్యలున్నప్పుడు ప్రజాదర్బార్‌లో ముందుగా తహశీల్దార్, అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రాలు ఇవ్వాలన్నారు. సమస్య పరిష్కారం కానప్పుడు అదే సమస్యను మళ్ళీ చెప్పేటప్పుడు ఎండార్స్‌మెంట్ అర్జీకి జోడించి ఇవ్వాలని సూచించారు. అంతకుముందు ఎమ్మెల్యే ఆది నారాయణ రెడ్డి, భూపేష్ సుబ్బరామి రెడ్డి న్యాక్ సెంటర్‌లో నిర్వహించిన జాబ్ మేళాలో పాల్గొని యువతకు ఉపాధి పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వైస్ చైర్మన్ నాగేశ్వర రెడ్డి, మల్లికార్జున, మోరగుడి డీలర్ విశ్వనాథ్ రెడ్డి, పాలూరు సుధీర్ కుమార్ రెడ్డి, వెల్డింగ్ గైబు, అంబవరం రామయ్య, బిర్రు సంతోష్, మండల అభివృద్ధి అధికారి, ఆంజనేయులు, తహశీల్దార్ శ్రీనివాసులురెడ్డి, మునిసిపల్ కమిషనర్ వెంకటరమణ రెడ్డి, ఎంపిడిఓ మున్నిషా, అధికారులు,ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న గృహాలు ఆగిపోవడానికి టిడిపి ప్రభుత్వమే కారణం : వైసిపి

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

పులివెందులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కక్ష సాధింపు చర్యలు చేపట్టారని, జగనన్న హౌసింగ్ కాలనీలో పేదల ఇళ్ల నిర్మాణం ఆగిపోవడానికి ప్రధాన కారణం టిడిపి ప్రభుత్వమేనని, మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వై.ఎస్. మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, పులివెందుల పట్టణ అధ్యక్షుడు హాలు గంగాధర్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ చిన్నప్ప, మాజీ చైర్మన్ రసూల్, పట్టణ ఉపాధ్యక్షులు కౌన్సిలర్ పార్నపల్లె కిషోర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్‌డిఒ కార్యాలయంలో ఆర్‌డిఒ చిన్నయ్యను కలిసి వినత పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇళ్లు లేని ప్రతి ఒక్కరికి ఇవ్వాలన్న సంకల్పంతో జగనన్న కాలనీ ఏర్పాటు చేశారని చెప్పారు. అప్పట్లో పార్టీ, కుల, మతాలకు అతీతంగా అందరికీ ఇళ్లు మంజూరు చేశారన్నారు. వైసిపి ప్రభుత్వం తరువాత ఎక్కడి గృహ నిర్మాణాలు అక్కడే ఆగిపోయాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు అవుతున్నా ఇంత వరకూ ఎలాంటి చర్యలు చేపట్టలేదని పేర్కొన్నారు. లబ్ధిదారుల నుండి రూ. 35000 డబ్బులు రాబట్టిన మాట వాస్తవమే అన్నారు. లబ్ధిదారులు కట్టిన డబ్బులు రూ. 9 కోట్లు మున్సిపల్ కమిషనర్ అకౌంట్లోనే ఉందన్నారు. కేవలం రూ. 20 కోట్లు ఖర్చు పెడితే 8000 ఇళ్ల పూర్తవుతాయన్నారు. ఇప్పటికైనా కూటమి నాయకులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆగిన ఇంటి నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, అంకాలమ్మ తల్లి దేవస్థానం చైర్మన్ ప్రసాద్, చంద్రమౌళి, నాగరాజు, కో - ఆప్షన్ నెంబర్ దాసరి చంద్రమౌళి, సంపత్, మస్తాన్‌వల్లి, వైసిపి నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్లు, లక్ష్మీ ప్రసన్న, గుల్జార్, ఖాదర్, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు 'పది' విద్యార్థులకు ప్రతిభ పరీక్ష

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా పరిషత్ సభా భవనంలో ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు తెలుగు, హిందీ భాషలపై ఈనెల 23న ప్రతిభా పరీక్ష నిర్వహించనున్నట్లు రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ కోశాధికారి బి.గంగాధర్, జిల్లా అధ్యక్షులు బి.వి. ప్రసాద్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 నుంచి 11:30 గంటల వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. విజేతలకు మధ్యాహ్నంబహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. తెలుగు, హిందీ, ఉర్దూ ఉద్యోగోన్నతలు తీసుకున్న కొత్తవారికి, మెగా డిఎస్‌సి వారికి సన్మాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా పంచ సహస్ర అవధాని, పద్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, స్లాట్ ఉపాధ్యాయ సంఘాల గౌరవాధ్యక్షులు శ్రీనివాసులరెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు అంకాలు కొండయ్య, ప్రధాన కార్యదర్శి శివానందరెడ్డి, ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డి, కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత చదువుల బాబు హాజరవుతారని తెలిపారు. సాహిత్య అభిమానులు కళాకారులు హాజరుకావాలని పేర్కొన్నారు.

జగన్ హంగామా సరికాదు : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

నాంపల్లి సిబిఐ ప్రత్యేక కోర్టు వద్ద మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డి చేసిన హడావిడి, హంగామా ఏమాత్రం సమంజసం కాదని పిసిసిఅధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒక కేసులో హైకోర్టు ఆదేశం మేరకు వ్యక్తిగతంగా హాజరు అయ్యేందుకు వెళ్లిన సమయంలో జన సమీకరణ చేసి బల ప్రదర్శన చేయడం అవసరమా అన్నారు. దేనికైనా సమయం, సందర్భం ఉండాలని సూచించారు. '2029లో వైసిపి అధికారంలోకి రాగానే రఫా రప్పా, పొట్టేలు నరికినట్లు నరుకుతాం' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేయడం, ఫ్లెక్సీలు ప్రదర్శించడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ఇది అరాచకం కాదా అన్నారు. ఇది బలుపు కాదు వాపు మాత్రమేనని వైసిపి నేతలు గ్రహించాలని కోరారు. కేసు కొట్టేసినప్పుడు కానీ లేదా అనేక రోజులు జైలులో ఉండి బెయిల్ మీద బయటకు వచ్చినప్పుడు కానీ జన సమీకరణ చేసి బలప్రదర్శన చేశారంటే అర్థం ఉందని చెప్పారు. అలా కాకుండా బెయిల్ మీద ఉన్న ఒక వ్యక్తి అందులో ప్రధాన నిందితుడు విచారణ కోసం కోర్టుకు వ్యక్తిగతంగా హాజరు అయ్యేటప్పుడు జన సమీకరణ చేసి బల ప్రదర్శన చేయడం విడ్డూరమని చెప్పారు.

'పిఎంఎవైజి'కి 30 వరకు గడువు

ప్రజాశక్తి - చాపాడు

ప్రధానమంత్రి ఆవాస్ యోజన్ - గ్రామీణ్ (పిఎంఎవైజి) పథకానికి ఈనెల 30 వరకు గడువు పొడిగించారని హౌసింగ్ డిఇ రమేష్ తెలిపారు. శుక్రవారం చాపాడు హౌసింగ్ కార్యాలయంలో మండల పరిధిలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్ లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులకు గృహ నిర్మాణాలు చేపట్టేందుకు మరో అవకాశం కల్పించారన్నారు. గృహ నిర్మాణాలకు ముందుకొచ్చేందుకు ఈ నెల 5 వరకు గడువు ఉండేదని దానిని పెంచారన్నారు. గ్రామస్థాయిలో అనుకున్న మేర లక్ష్యాలను చేరుకోకపోవడంతో మరోసారి గడువు పొడిగించారన్నారు. ఈ మేరకు లబ్ధిదారుల వివరాలను సంబంధిత సచివాలయాల పరిధిలోని సిబ్బంది ఆవాస్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేందుకు ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. ఫిబ్రవరి నాటికి అనుకున్న లక్ష్యాన్ని పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఆర్‌టిజిఎస్ సర్వే నిర్వహిస్తున్నారని ఇప్పటికే గృహాలు పూర్తయిన వారికి బిల్లులు మంజూరయ్యాయా లేదా పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో ఎఇ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సయ్యద్ నాజర్‌కు సత్కారం

ప్రజాశక్తి - కడప



నాజర్‌ను సన్మానిస్తున్న అఫ్జల్‌ఖాన్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జాతీయ అవార్డు అందుకొని కడప నగరానికి విచ్చేసిన మహాకవి షేక్ సయ్యద్ నాజర్‌ను శుక్రవారం అఫ్జల్ ఖాన్ గ్రూప్స్ మేనేజింగ్ డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ మాజీ నగర అధ్యక్షులు అఫ్జల్ ఖాన్ శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖులు, ఇతర పార్టీ నాయకులు, మేధావులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.



మహిళలను ఉద్దేశించి మాట్లాడుతున్న కానిస్టేబుల్ పి.సురేష్‌బాబు

మహిళలతోనే సమాజ రక్షణ

ప్రజాశక్తి - జమ్మలమడుగు

మహిళల సంరక్షణతోనే సమాజ పరిరక్షణ సాధ్యమవుతుందని కానిస్టేబుల్ పి. సురేష్‌బాబు తెలిపారు. శుక్రవారం పెద్దముడియం మండలం పెద్దపసుపల గ్రామంలో ఎస్ఐ సుబ్బారావు ఆదేశాల మేరకు పిఎం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో విద్యార్థులకు మహిళా భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కానిస్టేబుల్ మాట్లాడుతూ మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని పేర్కొన్నారు. మహిళలు భయాన్ని వదిలి ముందుకు వెళ్లాలన్నారు. భయపడితే ముందుకు సాగలేరనే విషయాన్ని వారు గ్రహించినప్పుడే సమాజంలోని అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వ్యక్తులకు భయం పడుతుందన్నారు. మహిళలు తలుచుకుంటే ఏమైనా చేయగలరని పేర్కొన్నారు. ఏమైనా సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే డయల్ 112, 100 లేదా 91211 00610 నంబర్లకు ఫోన్ చేసి విషయం తెలపాలన్నారు. అనంతరం మీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మహిళలు, జిల్లా పరిషత్ ఉన్నత హైస్కూల్‌లోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **బ్రహ్మంగారిమఠం :** శుక్రవారం స్థానిక వీరబ్రహ్మేంద్ర జూనియర్ కళాశాలలో ఎస్ఐ శివప్రసాద్ విద్యార్థులతో ముఖాముఖిని ఏర్పాటు చేశారు. సైబర్ క్రైమ్ బాల్యవివాహాలు, రోడ్ సేఫ్టీ అంశాలు, చట్టాల పైన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యాజమాన్యం తరపున సబ్ ఇన్స్పెక్టర్ శివప్రసాద్‌ను శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ముండ్లపాటి చంద్రశేఖర్, లెక్చరర్స్ గురు స్వప్న,వీర లక్ష్మి, శారద పోలీస్ సిబ్బంది రమణ,సాలమ్మ, మహిళా పోలీస్ శ్రీజా రాణి పాల్గొన్నారు.

విద్యుత్ అదాలత్ నిర్వహణ అభినందనీయం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్ : వినియోగదారుల సమస్యలు పరిష్కరించడం కోసం విద్యుత్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని విశ్రాంత జడ్జి ఆంజనేయమూర్తి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని డివిజన్ కార్యాలయం ఆవరణలో విద్యుత్ ప్రజా కళా వేదిక వద్ద విద్యుత్ అదాలత్ నిర్వహించారు. కార్యక్రమానికి రిటైర్డ్ జడ్జి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భగా డిఇఒ మాట్లాడుతూ నిరంతరం, నాణ్యమైన విద్యుత్‌ను వినియోగదారులకు సరఫరా నిత్యం రైతులు, వినియోగదారులతో సమావేశాలు నిర్వహిస్తూ వారి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తున్నామని చెప్పారు. ఇంకా ఎవరికైనా సమస్యలుంటే రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే పరిష్కరిస్తామని చెప్పారు.కార్యక్రమంలో ఎడిఇ గురుమోహన్‌రెడ్డి, ఎడి, సుధాకర్‌రెడ్డి,ఎఎఒ ఆఫీసర్ విజయలక్ష్మి, టెక్నికల్ ఎఇ హరిణి ఎఇలు జగదీష్ రెడ్డి, రమేష్ రెడ్డి, సబ్ ఇంజనీర్ జాఫర్, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ప్రజాశక్తి - కాశినాయన : మండలంలోని ఓబులాపురం గ్రామ సమీపంలో ఉన్న వివేకానంద సేవాశ్రమంలో మరణించిన ప్రసాద్ అనే అనాథకు వివేకానంద ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులు శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపకులు రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కొమరోలుకు చెందిన ప్రసాద్ (54)కు ఎవరూ లేరని, నడవలేక మలమూత్రాలు సైతం విసర్జిస్తూ అనారోగ్యంతో బాధపడేవాడని పేర్కొన్నారు. కొన్ని నెలలు తాము చేరదీశామని చెప్పారు. అప్పటి నుంచి అనాథకు అన్ని సపర్యలు చేశామని, పరిస్థితి విషమించి మృతిచెందాడని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ గౌరవ సలహాదారులు చెముడూరి వీరాస్వామి, సంస్థ ప్రతినిధి చిన్ని సునీల్ కుమార్ పాల్గొన్నారు.



బహుమతులతో శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు

రాష్ట్ర స్థాయి పోటీలకు 'శ్రీచైతన్య' విద్యార్థులు

ప్రజాశక్తి - వేంపల్లె : భగవాన్ శ్రీ సత్య సాయి బాబా శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని సత్యసాయి సేవా సమితి వేంపల్లి శాఖ నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో శ్రీ చైతన్య ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీలకు ఎంపికైనట్లు అ పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి తెలియజేశారు. మండల స్థాయి వ్యాస రచన పోటీల్లో నందిని, గౌరీదేవి, తనుశ్రీ, పూర్ణిమ, సుచిత్ర, చరణ్ అనే విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ప్రతిభ చూపినట్లు చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు నిర్వాహకులు ప్రశంస పత్రాలను, జ్ఞాపికలను విద్యార్థులకు అందజేసినట్లు చెప్పారు. వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు శుక్రవారం పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి అభినందించారు. రాష్ట్రస్థాయిలో బహుమతులు సాధించడం తమ పాఠశాలకు గర్వకారణమని చెప్పారు. విద్యార్థుల ప్రతిభకు గురువుల మార్గదర్శకత ఉందన్నారు. ఈ విజయంలో ఉపాధ్యాయులు కూడ ప్రధాన పాత్ర పోషిచడం సంతోషకరమని చెప్పారు. విద్యార్థులు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - తొండూరు : జాతీయ గ్రంథాలయం ముగింపు వేడుకలను స్థానిక శాఖ గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిని స్వరూపరాణి, ఉపాధ్యాయులు, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

'గండి' హుండీ ఆదాయం రూ.25.73 లక్షలు

ప్రజాశక్తి - చక్రాయపేట

స్థానిక శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం హుండీ కానుకల లెక్కింపును ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య, గండి దేవస్థాన చైర్మన్ కావలి కృష్ణ తేజ ఆధ్వర్యంలో నిర్వహించారు. కడప దేవదాయ శాఖ సూపర్ డెంట్ రవణమ్మ పర్యవేక్షణలో హుండీల ద్వారా రూ. 25,07,015 అన్నదానం వితరణ హుండీ ద్వారా రూ 66,247 నగదు, బంగారు వస్తువులు 700.000 గ్రాములు, మిక్సింగ్ వెండి వస్తులు 800.000 గ్రాములు, వచ్చిందని అధికారులు పేర్కొన్నారు. 84 రోజులకు గాను ఆదాయం వచ్చిందని ఎసి తెలిపారు. అధికారులు, దేవస్థానం ఉద్యోగులందరూ రాష్ట్ర ఉన్నతాధికారుల సూచన మేరకు సంప్రదాయ వస్త్రధారణతో లెక్కింపు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన, ఉప ప్రధాన అర్చకులు కేసరి స్వామి, రాజా స్వామి, మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, చక్రాయపేట ఎపిజిబి సిబ్బంది, ఆర్కేవ్యాలీ పోలీస్ స్టేషన్ సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు